సాక్షి
విజయనగరం

మంగళవారం । 19 । నవంబర్ । 2024



వినతులకు కచ్చితమైన పరిష్కారం

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన వినతులకు నాణ్యమైన, కచ్చితమైన సమాధానాలు ఇవ్వాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. -8లో..



కార్తీక పూజలు

కార్తీక మూడో సోమవారం ముక్కంటేశ్వరుని ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పశుపతినాథేశ్వర స్వామి ఆలయంలో సామూహిక అభిషేకాల్లో పాల్గొన్న భక్తులను చిత్రంలో చూడొచ్చు.

పంటల బీమా చెల్లింపు గడువు పెంపు

విజయనగరం ఫోర్ట్: జీడిమామిడి పంటకు వాతావరణ బీమా చెల్లింపు గడువును ఈ నెల 22 వరకు పొడిగించినట్టు ఉద్యానశాఖ అధికారి జమదాగ్ని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీమా చెల్లింపునకు ఈ నెల 15వ తేదీతో గడువు ముగిసిందని, వివిధ సమస్యలతో రైతులు బీమా ప్రీమియం చెల్లించలేకపోవడంతోగడువు పెంచినట్టు పేర్కొన్నారు. ఇప్పటివరకు ప్రీమియం రూపంలో రూ.4.97లక్షలు చెల్లించారన్నారు.

న్యూస్‌రీల్

పైడితల్లిని దర్శించుకున్న రైల్వే ఐజీ



రైల్వే ఐజీ భవానీనాథ్ శంకర్‌కు అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేస్తున్న ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారిని రైల్వే (భువనేశ్వర్) ఐజీ భవానీనాథ్‌శంకర్ సోమవారం దర్శించుకున్నారు. ఆలయ వేదపండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేదాశీస్సులు అందజేశారు. అనంతరం ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు అమ్మవారి శేషవస్త్రాలను, చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో రైల్వే పోలీస్ అధికారులు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ పోరాటం తప్పదు

గజపతినగరం: టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి అర్ధ సంవత్సరం కావస్తున్నా ప్రభు త్వ ఉద్యోగుల పీఆర్సీ, ఐఆర్‌పై ఎలాంటి ఆలోచన చేయకపోవడం దురదృష్టకరమని, రానున్న రోజుల్లో ఉద్యోగ పోరాటం తప్పదని ఎస్జీటీ (సెకెండరీ గ్రేడ్ టీచర్స్) ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.చంద్రరావు హెచ్చరించారు. గజపతినగరం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన సోమవారం మాట్లాడారు. ఎన్నికల ముందు కూటమినాయకులు ఇచ్చిన హామీలను నమ్మి మద్దతు తెలిపామని, ఇప్పుడు ఉద్యోగుల సమస్యలను పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

వర్సిటీ అభివృద్ధే లక్ష్యం

- జేఎన్‌టీయూ జీవీ ఇన్‌చార్జి వీసీ రాజ్యలక్ష్మి



మాట్లాడుతున్న జేఎన్‌టీయూ జీవీ ఇన్‌చార్జి వీసీ డి.రాజ్యలక్ష్మి

విజయనగరం అర్బన్: యూనివర్సిటీ అభివృద్ధే లక్ష్యమని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వర్సిటీ పేరు ఇనుమడింపజేసేలా ప్రతి ఒక్కరూ పనిచేయాలని జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి పిలుపునిచ్చారు. యూనివర్సిటీ సమావేశ మందిరంలో వర్సిటీ పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలన్నారు. ప్రతి విద్యార్థికి ఉజ్వల భవితను అందించడమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ మాట్లాడుతూ సమష్టి కృషితో బాధ్యతగా పనిచేస్తే ప్రమాణాలతో కూడిన విద్యను అందించవచ్చన్నారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్.రాజేశ్వరరావు, జాస్తి ఆనంద్ చందూలాల్, వర్సిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

తహసీల్దార్లపై కలెక్టర్ ఆగ్రహం

విజయనగరం అర్బన్: జిల్లాలో ఫ్రీ హోల్డ్ భూములపై ప్రభుత్వం కోరిన సమాచారాన్ని సరిగా అందించని తహసీల్దార్లపై కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మండిపడ్డారు. ఒకే అంశంపై పొంతన లేకుండా వివిధ రకాల గణాంకాలతో కూడిన నివేదికలు ఇవ్వడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ అంశాలపై జిల్లాలోని ఆర్డీఓలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లతో జేసీతో కలిసి సమీక్షించారు. ఫ్రీహోల్డ్ భూములపై వాస్తవ సమాచారం అందించని మండల స్థాయి రెవెన్యూ అధికారులపై క్రమశిక్షణ చర్యలకు వెనుకాడబోమని కలెక్టర్ హెచ్చరించారు. మంగళవారం నాటికి సరైన నివేదికలు అందించాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జేసీ ఎస్.సేతుమాధవన్, డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

భద్రత లేని వసతి

- ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లల్లో విద్యార్థుల అష్టకష్టాలు
- కనీస వసతుల్లేక ప్రతిరోజూ తప్పని అగచాట్లు
- భారీగా తగ్గిపోయిన విద్యార్థుల చేరికలు
- 'సాక్షి' క్షేత్ర పరిశీలనతో వెలుగులోకి పలు సమస్యలు



కొత్తవలస ఎస్సీ బాలుర హాస్టల్‌లో మంచాలు లేక నేలపైనే నిద్రకు ఉపక్రమిస్తున్న విద్యార్థి

వారంతా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన పిల్లలు. భవితను బంగారుమయం చేసుకునేందుకు.. తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ వసతిగృహాల్లో చదువులు సాగిస్తున్నారు. వీరికి ప్రస్తుతం భద్రత కరువైంది. వసతిగృహాలపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. అధ్వానంగా ఉన్న పరిసరాలు అనారోగ్యానికి గురిచేస్తున్నాయి. ప్రహరీలు లేక విషసర్పాల భయం వెంటాడుతోంది.

చలి వణికిస్తున్నా కిటికీలకు తలుపులు బిగించేవారే కరువయ్యారు. సరిపడా మరుగుదొడ్లు, స్నానపుగదులు లేకపోవడం, వసతి సమస్యలతో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానమే ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని పలు హాస్టళ్లను సోమవారం పరిశీలించిన 'సాక్షి'కి సమస్యలే స్వాగతం పలికాయి.

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

జిల్లా కేంద్రమైన విజయనగరంలోని కాట వీధిలోనున్న బీసీ హాస్టల్‌లో ఇటీవల కోండ్రు సాంబశివరావు అనే ఏడో తరగతి విద్యార్థి స్పృహతప్పి పడిపోయాడు. ఆస్పత్రికి తీసుకెళ్లేసరికే ప్రాణాలు కోల్పోయాడు. పర్యవేక్షణ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఆస్పత్రికి తరలించడంలో తీవ్ర జాప్యమైంది. ఆ రోజు ఆదివారం సెలవు అని సిబ్బంది తప్పించుకున్నా నైతికంగా వారి నిర్లక్ష్య ధోరణి కళ్లకు కడుతోంది. మరో విషయమేమిటంటే ఆ విద్యార్థి చనిపోవడానికి కారణాలేమిటనేదీ ఇప్పటికీ రహస్యంగానే ఉంచడం. ఎక్కడో శ్రీకాకుళం జిల్లా రణస్థలం నుంచి తమ బిడ్డను చదువుకోసం పంపిన సాంబశివరావు తల్లిదండ్రులకు సమాధానం చెప్పేవారే కానరాలేదు. ఈ తరహా ధోరణి వల్లే విద్యార్థులు అక్కడ అడుగుపెట్టడానికే హడలిపోతున్నారు. వాస్తవానికి గత ఐదేళ్లుగా ఆ హాస్టల్‌లో వంద మందికి తగ్గకుండా చేరికలు ఉండేవి. 'సాక్షి' సోమవారం పరిశీలించే సమయానికి అక్కడ సుమారు నలభై మంది మాత్రమే విద్యార్థులు ఉన్నారు. ఇళ్లకు వెళ్లిపోయిన విద్యార్థులు తిరిగి హాస్టల్‌కు ఎందుకు రాలేదని ఆరా తీసే అధికారే కరువయ్యారు. జిల్లా కేంద్రంలోనే పరిస్థితి ఇలా ఉంటే మారుమూల హాస్టళ్లలో పరిస్థితి ఎలా ఉందనేదీ ఇటీవల హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో పలు హాస్టళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన 'సాక్షి'కి విద్యార్థుల కష్టాలు కళ్లకు కట్టాయి. ప్రభుత్వ నిర్లక్ష్యం ఫలితంగా ప్రతి రోజూ అగచాట్లు తప్పట్లేదు. విద్య కోసం వసతి వెతుక్కుంటూ ఎక్కడెక్కడి నుంచో ఈ హాస్టళ్లకొచ్చే నిరుపేద కుటుంబాల్లోని విద్యార్థులు తీరా ఇక్కడ అస్తవ్యస్త పరిస్థితుల మధ్య అనారోగ్యం బారినపడుతున్నారు.

తగ్గిపోతున్న ప్రవేశాలు...

జిల్లాలో మొత్తం 98 హాస్టళ్లు ఉన్నాయి. బీసీ 51, ఎస్సీ 30, ఎస్టీ 17 ఉన్నాయి. వీటిలో 27 హాస్టళ్లు ఇంకా అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. బీసీ హాస్టళ్లలో ప్రీమెట్రిక్ 36, పోస్ట్ మెట్రిక్ 15 ఉన్నాయి. ఇక్కడ వసతుల్లేక, తగిన పర్యవేక్షణ, భద్రత లేకపోవడంతో చాలా హాస్టళ్లలో ప్రవేశాలు తగ్గిపోయాయి. ఉదాహరణకు 36 బీసీ ప్రీమెట్రిక్ హాస్టళ్లలో మంజూరైన సీట్లు 3,800 వరకు ఉన్నాయి. కానీ ఈ ఏడాది కేవలం 2,018 మంది మాత్రమే చేరారు. మిగతా సీట్లన్నీ ఖాళీగానే ఉన్నాయి. జిల్లాలోని మొత్తం 30 ఎస్సీ హాస్టళ్లలో ప్రీమెట్రిక్ 14 ప్రభుత్వ భవనాల్లోనే ఉన్నాయి. 16 పోస్టు మెట్రిక్ హాస్టళ్లలో ఏడు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. 12 మంది ప్రీమెట్రిక్ బాలుర హాస్టళ్లలో 654 మంది, రెండు బాలికల హాస్టళ్లలో 115 మంది మాత్రమే చేరారు. ఎనిమిది పోస్టుమెట్రిక్ బాలుర హాస్టళ్లలో 636 మంది, బాలిక హాస్టళ్లలో 686 మంది ఉన్నారు. జిల్లాలో ఎనిమిది గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, తొమ్మిది పోస్టు మెట్రిక్ హాస్టళ్లు ఉన్నాయి.



అలుగోలు హాస్టల్‌లో తలుపులు లేని మరుగుదొడ్లు

గుక్కెడు నీరూ కరువే...

నెల్లిమర్ల నియోజకవర్గంలోని చాలా హాస్టళ్లలో మరుగుదొడ్లు సరిగా లేవు. చివరకు తాగడానికి గుక్కెడు మంచి నీరు దొరకట్లేదు. ధరల పెరుగుదల సాకుతో మెనూ మార్చేశారు. కొప్పెర్ల గురుకులంలో 600 మంది విద్యార్థులు ఉన్నా సరిపడా మరుగుదొడ్లు లేకపోవడంతో ఆరుబయటకు వెళ్తున్నారు. చివరకు నెల్లిమర్లలోని బాలికల గురుకులంలోనూ అదే పరిస్థితి. డెంకాడ మండలం పెదతాడివాడలో అద్దె భవనంలోని ఇరుకు గదుల్లోనే విద్యార్థులు సర్దుకుపోతున్నారు. భోగాపురం బీసీ బాలుర వసతి గృహం శిథిలమవ్వడంతో జెడ్పీ హైస్కూల్ తరగతి గదిలోనే వసతి కల్పించారు.

'చలి'లోనే వసతి...

గజపతినగరం నియోజకవర్గంలోని దత్తిరాజేరు బీసీ బాలుర వసతి గృహంలో సరిపడ స్నానపు గదులు లేవు. కె.కొత్తవలసలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల (బీసీ బాలురు)లో నేలపైనే భోజనాలు చేస్తున్నారు. కిటికీలకు మెస్‌లు లేకపోవడంతో చలి బాధ తప్పట్లేదు. గజపతినగరంలోని బాలికల వసతి గృహం అద్దె భవనంలో ఉంది. వర్షం పడితే చాలా చోట్ల నీరు కారుతోంది. గంట్యాడ మండల కేంద్రంలోని వసతిగృహంలో రెండే స్నానపు గదులు ఉండడంతో విద్యార్థులు ఆరు బయట స్నానాలు చేస్తున్నారు. బీసీ బాలురు వసతి గృహంలో మరుగుదొడ్లకు తలుపులు లేవు. బొండపల్లి మండలం దేవుపల్లి బాలికల వసతి గృహంలో మరుగుదొడ్లు లేవు. బొండపల్లిలోని బీసీ బాలికల వసతి గృహ భవనం శిథిలావస్థకు చేరింది.

భద్రత గాలికొదిలేశారు

చీపురుపల్లి నియోజకవర్గంలోని వసతి గృహాల్లో భద్రత పూర్తిగా గాలికి వదిలేశారు. సీసీ కెమెరాలు లేవు. కనీస సదుపాయాలు కూడా కనిపించవు. చీపురుపల్లిలో ప్రభుత్వ కళాశాలల బాలికల వసతి గృహానికి ప్రహరీ ఉన్నప్పటికీ సోలార్ ఫెన్సింగ్ లేదు. గుర్ల మండలంలోని కలవచర్ల బీసీ సంక్షేమ బాలుర వసతి గృహంలో మరుగుదొడ్లు పూర్తిగా పాడయ్యాయి. ఇక్కడ ప్రహరీ ఉన్నప్పటికీ గేటు లేదు. సోలార్ ఫెన్సింగ్, సీసీ కెమెరాలు లేవు. మంచాలపై పరుపులు ఉండవు. మెరకముడిదాం మండలంలోని గర్భాంలో సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో కిటికీలకు తలుపులు లేకపోవడంతో విద్యార్థులు చల్లగాలి తట్టుకోలేక దుప్పట్లు అడ్డుగా కట్టారు. ఇక్కడ మరుగుదొడ్ల తలుపులు పూర్తిగా పాడయ్యాయి.



దత్తిరాజేరు మండలం కె.కొత్తవలస గురుకుల పాఠశాలలో నేలపైనే భోజనాలు



బొబ్బిలి ఎస్సీ బాలికల కళాశాల హాస్టల్‌లో మూతపడిన బయో లెట్రిన్

అసౌకర్యాల తిష్ట...

బొబ్బిలి నియోజకవర్గంలోని పలు హాస్టళ్లలో అసౌకర్యాలు తిష్టవేశాయి. చివరకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అందజేసిన మినరల్ వాటర్ ప్రాజెక్టులు కూడా సరిగా నిర్వహణ లేక అలంకారప్రాయమయ్యాయి. బొబ్బిలి ఎస్సీ బాలికల కళాశాల వసతిగృహంలో పుస్తకాలు, పెట్టెలు భద్రపరచిన చోటే విద్యార్థుల నిద్ర, భోజనం చేయాల్సిన పరిస్థితి. స్నానపు గదులున్నా రన్నింగ్ వాటర్ లేక బయటే స్నానాలు చేస్తున్నారు. ఎస్సీ కళాశాల బాలుర వసతి గృహానికి ప్రహరీ లేదు.

ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ఎక్కడ?

శృంగవరపుకోట నియోజకవర్గంలో హాస్టళ్ల సమస్య తీరట్లేదు. నియోజకవర్గ కేంద్రమైన ఎస్.కోటలో ఉన్న ఎనిమిది హాస్టళ్లనూ ఒకే గొడుగు కింద చేర్చి ఒకే మెనూ అమలయ్యేలా ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నిర్మించాలన్న ప్రతిపాదనకు మోక్షం కలగలేదు. ఎస్సీ కళాశాల బాలుర వసతి గృహం, బాలికల వసతి గృహం, బీసీ కళాశాల బాలుర వసతి గృహం, బాలికల వసతి గృహాలు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. వీటికి నెలకు రూ.1.50 లక్షలు అద్దె చెల్లిస్తున్నారు. అయినా బెడ్లు లేవు. అరకొరగా మరుగుదొడ్లు, బాత్రూమ్‌లు ఉన్నాయి. పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేక దోమల సమస్య ఎక్కువగా ఉంది.

ఏదీ పర్యవేక్షణ?

రాజాం నియోజకవర్గంలోని చాలా ప్రభుత్వ వసతిగృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు సరైన వసతి లేదు. వారి ఆరోగ్యంపై పర్యవేక్షణ లేదు. మరుగుదొడ్లు, స్నానపు గదుల సమస్య తీవ్రంగా ఉంది. మెనూ బాగోలేక కొంతమంది విద్యార్థులు బయట నుంచి భోజనాలు తెచ్చుకుంటున్నారు. శ్రీకాకుళం రోడ్డులోని సాంఘిక సంక్షేమ పోస్టు మెట్రిక్ బాలుర హాస్టల్‌లో ఈ పరిస్థితి కనిపించింది.



రాజాం హాస్టల్‌లో బయట నుంచి ఆహారం తెప్పించుకొని తింటున్న విద్యార్థులు



జొన్నవలస వసతిగృహం పరిసరాలను శుభ్రం చేసుకుంటున్న విద్యార్థులు

విద్యార్థులే స్వీపర్ల అవతారం...

జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోనే ఉన్న జొన్నవలస గ్రామంలోని బీసీ సంక్షేమ బాలుర వసతిగృహంలో 19 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఒకవైపు గోడలు, మరోవైపు స్లాబు పెచ్చులూడిపోయి శిథిలావస్థలో కనిపిస్తున్నాయి. చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయినా తొలగించలేదు. చివరకు ఆ విద్యార్థులే హాస్టల్‌ను శుభ్రం చేసుకుంటున్నారు. నగరంలోనే ఉన్నా అంతకన్నా దారుణమైన పరిస్థితులు రాజ్యలక్ష్మి థియేటర్ సమీపంలోని బీసీ బాలుర వసతిగృహంలో కనిపిస్తున్నాయి.



తెర్లాం మండలంలోని పెరుమాళి హాస్టల్‌కు కర్రలతో ప్రహరీ

ఏకాగ్రతతోనే లక్ష్యాల సాధన



డీఎస్సీకి సిద్ధమవుతున్న విద్యార్థులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: ఏకాగ్రతతోనే లక్ష్యాల సాధన సాధ్యమని కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అన్నారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని గురజాడ అప్పారావు బీసీ స్టడీ సర్కిల్ బీసీ అభ్యర్థులకు అందిస్తున్న డీఎస్సీ ఉచిత శిక్షణను కస్పా మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఉపాధ్యాయ నియామక రాత పరీక్షకు సన్నద్ధమవుతూనే జాతీయ స్థాయిలో నిర్వహించే వివిధ రకాల పోటీ పరీక్షలపై దృష్టిపెట్టాలన్నారు. పోటీ పరీక్షలను ఎదుర్కోవడంలో తన అనుభవాలను వివరించారు. జిల్లా బీసీ సంక్షేమ అధికారి పెంటోజీ మాట్లాడుతూ బీసీ స్టడీ సర్కిల్ ద్వారా 182 మందికి రెండు నెలల పాటు ఉచిత శిక్షణ, రూ.వెయ్యి విలువచేసే స్టడీ మెటీరియల్‌తో పాటు నెలకు రూ.1,500 చొప్పున స్టైఫండ్‌గా అందజేస్తామని తెలిపారు.

హాస్టల్ భవనాల మరమ్మతులకు చర్యలు

విజయనగరం అర్బన్: సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు సొంత భవన నిర్మాణాలతో పాటు మరమ్మతుల పనులకు ప్రతిపాదనలు పంపించాలని కలెక్టర్ డా.బీఆర్ అంబేడ్కర్ అధికారులకు సూచించారు. తన చాంబర్‌లో సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ, గిరిజన సంక్షేమం, దివ్యాంగులు, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు, వైద్య ఆరోగ్య, ఐసీడీఎస్ శాఖల అధికారులతో వివిధ అంశాలపై సోమవారం సమీక్షించారు. జిల్లాలో సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్ 30 ఉండగా 7 సొంత భవనాల కోసం ఇదివరకే ప్రతిపాదనలు పంపినట్టు ఆ శాఖ డీడీ తెలపగా రూ.3 లక్షలలోపు ఖర్చుచేసే మరమ్మతుల పనులకు ప్రతిపాదనలను పంపాలని డీడీకు సూచించారు. వసతి గృహాల్లో కనీస సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. మండల ప్రత్యేకాధికారులు ప్రతినెల వసతి గృహాలను తనిఖీ చేసి నివేదికలను హెచ్‌ఓడీలకు పంపాలన్నారు. ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రూ.7 కోట్లు, సహాయి కర్మచారి కార్పొరేషన్ ఇచ్చే రూ.5.5 కోట్ల రుణాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గర్భిణులు, బాలికల్లో రక్తహీనత సమస్యను పరిష్కరించేందుకు వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

వెబ్‌సైట్‌లో మెరిట్ జాబితా

విజయనగరం అర్బన్: కేజీబీవీల్లో టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులకు ఎంపిక చేసిన అభ్యర్థుల మెరిట్ జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచినట్టు డీఈఓ యు.మానిక్యంనాయుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాబితాలో ఉన్నవారి ధ్రువీకరణ పత్రాలను ఈ నెల 22న సమగ్ర శిక్ష కార్యాయంలో పరిశీలిస్తామని చెప్పారు.



లక్ష దీపోత్సవం

ముక్కంటేశ్వరునికి ప్రీతికరమైన కార్తీక సోమవారం చీపురుపల్లి పట్టణం దీపకాంతులతో మెరిసిపోయింది. కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో లక్ష దీపోత్సవాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం పార్వతీ పరమేశ్వరుల కళ్యాణోత్సవంతో ప్రారంభమైన దీపారాధనలో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. ఏపీ సాధు హిందు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి కార్తీకమాస విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో గురుస్వామి వైసీహెచ్.అప్పలనాయుడు, పిన్నింటి రామారావు, తమ్మినాయుడు, మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, తదితరులు పాల్గొన్నారు. – చీపురుపల్లి

108 ఉద్యోగుల రిలేనిరాహార దీక్ష



రిలే నిరహార దీక్ష చేస్తున్న 108 ఉద్యోగులు

విజయనగరం ఫోర్ట్: సమస్యలు పరిష్కరించాలంటూ 108 ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం రిలే నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు వి. అప్పలనాయుడు మాట్లాడుతూ 108 సర్వీసులను ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. 108లో రోజుకు 3 షిఫ్టులలో 8 గంటల పని విధానం అమలు చేయాలన్నారు. 108 సర్వీసులో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వ నియామకాల్లో వెయిటేజ్ మార్కులు అందించాలన్నారు. వైద్య, ఆరోగ్యశాఖలో ఈఎంటీ పోస్టుల నియామకాల్లో 108లో పనిచేస్తున్న ఈఎంటీలను నియమించాలని కోరారు. ఉద్యోగులు సహజ, ప్రమాద మరణం పొందిన సమయంలో కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గోపాలం, పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

హమాలీల ఆందోళన



ధర్నా చేస్తున్న హమాలీలు

విజయనగరం ఫూల్‌బాగ్: సివిల్ సప్లయ్స్‌లో పనిచేస్తున్న హమాలీలు ఆందోళనకు దిగారు. దాసన్నపేటలోని సివిల్ సప్లయ్స్ జిల్లా మేనేజర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. సమస్యలు పరిష్కరించుకుంటే డిసెంబర్ పదో తేదీ తర్వాత సమ్మె చేస్తామని హెచ్చరించారు. ప్రతి రెండేళ్లకోసారి జరగాల్సిన కూలిరేట్ల ఒప్పందం 2023 డిసెంబర్‌తో ముగిసిందని, తక్షణమే నూతన ఒప్పందం చేసుకోవాలని హమాలీస్ యూనియన్ ఆఫ్ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి పి.కామేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్త రేట్ల ఒప్పందం ప్రకారమే లోడింగ్, అన్‌లోడింగ్ బకాయిలు చెల్లించాలన్నారు. కూలి రేటు రూ.2లు పెంచుతామని టీడీపీ కూటమి ప్రభుత్వం చెబుతోందని, ఇది చాలదన్నారు. అనంతరం డీఎంకు డిమాండ్లతో కూడిన సమ్మె నోటీసును హమాలీలు అందజేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు నర్సింహులు, నారాయణ స్వామి, హమాలీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బోగస్ ఎస్టీ కులధ్రువీకరణ పత్రాలపై విచారణ



విచారణ చేస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట: బోగస్ ఎస్టీ కులధ్రువీకరణ పత్రాలపై ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి తన చాంబర్‌లో సోమవారం విచారణ చేసి 5 కేసులను పరిశీలించారు. ఫిర్యాదుదారులు, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇరువర్గాల వద్ద ఉన్న ఆధారాలను తనిఖీ చేశారు. అనంతరం విచారణను ఈనెల 25కు వాయిదా వేశారు. కార్యక్రమంలో డీడీ అన్నదొర, సూపరెంటెండెంట్ దేశ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియనివ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

జామి: మండలకేంద్రంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ విషయంపై పోలీసులు అందించిన వివరాల ప్రకారం భిక్షాటన చేస్తూ తిరుగుతుండే వ్యక్తి భీమసింగి గ్రామంలో ఆదివారం అనారోగ్యంతో పడి ఉండడంతో స్థానికులు విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా..చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతదేహాన్ని విజయనగరం మార్చురీలో ఉంచారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు ఎవరైనా జామి పోలీస్‌స్టేషన్‌లో సమచారం అందించాలని ఎస్సై వీరజనార్దన్ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

చీపురుపల్లి: పట్టణంలోని జగన్నాథరాజు కాలనీ వినాయక టవర్స్‌లో నివాసం ఉంటున్న టి.నాగమణి(33) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ఎల్.దామోదరరావు తెలిపారు. మృతురాలి భర్త ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. సోమవారం ఇంట్లో అందరూ ఉండగానే క్షణికావేశంలో నాగమణి బెడ్‌రూమ్‌లోకి వెళ్లి ఉరివేసుకున్నట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. మృతురాలికి భర్త ప్రసాద్, బాబు నయాన్ష్, పాప గీతాన్ష్ ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

విజయనగరం క్రైమ్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందులూ సోమవారం మృతిచెందాడు. ఈ ఘటనపై వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోటీపరీక్షలకు ప్రిపేరవుతూ తన చిన్నాన్న ఇంటిలో ఉంటూ చదువుకుంటున్న పెనుమజ్జి అనిల్ కుమార్ (30) ఈ నెల 17న మధ్యాహ్నం బైక్‌పై మార్కెట్‌కు వెళ్తుండగా అయ్యన్నపేట జంక్షన్ యూనియన్ బ్యాంక్ ఏటీఎం వద్ద వెనుక నుంచి నిర్లక్ష్యంగా బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో అనిల్ కుమార్ తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు 108 సాయంతో జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుని చిన్నాన్న పెనుమజ్జి లక్ష్మణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ చోరీ

భోగాపురం: మండల కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న స్టేట్ బ్యాంకు–2 ప్రాంతానికి చెందిన ఆర్ ఉమాదేవి భర్త సొంత పనుల నిమిత్తం ఈనెల 15వ తేదీన పల్సర్ బైక్‌పై బయటకు వెళ్లాడు. పనులు ముగించుకుని తిరిగి అదే రోజు రాత్రి 10 గంటలకు ఇంటికి చేరుకున్నాడు. ఉదయం లేచి చూసేసరికి ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైక్ కనిపించకపోవడంతో చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఉమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పాపారావు తెలిపారు.

బైక్ చోరీపై కేసు నమోదు

వంగర: మండల పరిధిలోని శివ్వాం గ్రామంలో ఏనుగుతల వెంకటనాయుడికి చెందిన బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారని ఎస్సై షేక్ శంకర్ సోమవారం తెలిపారు. వెంకటనాయుడు తన రేకుల షెడ్డులో ఆదివారం రాత్రి పార్కింగ్ చేసిన బైక్ సోమవారం ఉదయం చూసేసరికి లేకపోవడంతో ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పోక్సో కేసు నమోదు

విజయనగరం క్రైమ్: మండల పరిధిలోని జమ్మునారాయణపురంలో ఏడేళ్ల బాలికపై సోమవారం లైంగికదాడి జరిగింది. దీనికి సంబంధించి విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. సుమారు 50 నుంచి 60 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి ఒంటరిగా ఉన్న ఏడేళ్ల బాలికపై కన్నేసి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న బాలిక కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించారు. దీంతో హుటాహుటిన డీఎస్పీతో పాటు దిశ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టి నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹200

వినతులకు కచ్చితమైన పరిష్కారం

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన వినతులకు నాణ్యమైన, కచ్చితమైన సమాధానాలు ఇవ్వాలని రీ ఓపెన్ చేసే పరిస్థితి లేకుండా చూడాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. ఏ రోజు వినతులు ఆ రోజే అధికారులు ఓపెన్ చేయాలని ఎక్కువగా రెవెన్యూకు చెందిన వినతులే వస్తున్నాయని తహసీల్దార్లు ఈ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావినతుల పరిష్కార వేదికలో భాగంగా ఈ మేరకు అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా జేసీ సేతుమాధవన్ మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఈ సర్వే మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాలని, అందుకు అవసరమైన మార్గదర్శకాలు త్వరలో విడుదల చేయనున్నట్లు, శిక్షణ కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే స్కిల్ సెన్సస్ కూడా ఈ నెల నుంచే జరగాలని అందుకు అవసరమైన మాస్టర్ ట్రైనీలకు శిక్షణ కూడా పూర్తి చేశామని తెలిపారు. జిల్లాలో 48 రీచ్‌లు అందుబాటులో ఉన్నాయని ప్రతి రీచ్‌కు ఒక గ్రామ కార్యదర్శిని ఇన్‌చార్జ్‌గా నియమించామని, ఉచిత ఇసుకను పొందడానికి కార్యదర్శి దగ్గర నుంచి పొందిన రసీదును తీసుకుని ఇసుకను పొందవచ్చని తెలిపారు. లోకాయుక్త కేసులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించుకోవాలని ఆయా అధికారులకు జేసీ సూచించారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్, జేసీ సేతు మాధవన్, డీఆర్‌ఓ ఎస్.శ్రీనివాసమూర్తి అర్జీదారుల నుంచి మొత్తం 205 అర్జీలు స్వీకరించారు.



పార్వతీపురం: అర్జీదారుల నుంచి వినతులను స్వీకరిస్తున్న జేసీ శోభిక

సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించాలి

విజయనగరం క్రైమ్: ప్రజల సమస్యల తక్షణ పరిష్కారానికి 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి 31 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. వారి సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చట్టపరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని ఆదేశించారు. తీసుకున్న చర్యల వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్పీ సీఐ ఎ.లీలారావు, డీసీఆర్‌బీ ఎస్సై రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

పార్వతీపురం: ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో వచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు జిలాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి 156 వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్



పార్వతీపురం: మూడు చక్రాల సైకిల్‌ను అందజేస్తున్న జేసీ శోభిక

ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలి

దివ్యాంగులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్ సందర్భంగా పలువురు దివ్యాంగులకు ఉపకరణాలను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా సాలూరు మండలం జీగిరాం గ్రామానికి చెందిన టి.నర్సింహులు, గొర్లె వెంకటరావులకు వినికిడి యంత్రాలు, పార్వతీపురానికి చెందిన కె.మోహన్‌రావుకు మూడు చక్రాల సైకిల్‌ను అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సర్వీసులో మంచి అధికారులుగా గుర్తింపు పొందాలి

- పీటీసీ ప్రిన్సిపాల్ డి.రామచంద్రరాజు

విజయనగరం క్రైమ్: పోలీస్‌శిక్షణ కళాశాలలో పూర్తిస్థాయిలో శిక్షణ పొంది సర్వీసులో మంచి అధికారులుగా గుర్తింపు పొందాలని పీటీసీ ప్రిన్సిపాల్ డి.రామచంద్రరాజు పేర్కొన్నారు. కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్‌లకు రెండు వారాల పాటు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని సోమవారం పీటీసీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ పీటీసీలో ఇచ్చిన శిక్షణను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నాసిన్ అడిషనల్ డైరెక్టర్ జె.ఎం.కిశోర్ మాట్లాడుతూ మంచి నైపుణ్యం కలిగిన అనుభవజ్ఞులైన వారితో పీటీసీలో ఇచ్చే శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వారి సర్వీసులో ఎదురైన సవాళ్లు, వాటి పరిష్కరించిన తీరు గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలని సూచించారు. ప్రస్తుతం కేంద్రప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన క్రిమినల్ లా, 2023 గురించి పూర్తిగా తెలుసుకోవాలని కోరారు. శిక్షణ కాలంలో అవుడోర్ శారీరక శిక్షణతో పాటు, ఆయుధాల మీద శిక్షణ, డ్రిల్, ఫైరింగ్ తదితర వాటిపై శిక్షణ ఉంటుందని చెప్పారు. పీటీసీలో ఉన్న అధునాతన డ్రైవింగ్ సిమిలేటర్, ఫైరింగ్ సిమిలేటర్‌పై శిక్షణ ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో నాసిన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.గిరిధర్, వైస్ ప్రిన్సిపాల్ పీవీ.అప్పారావు, డీఎపీ టి.రమేష్, ఇండోర్, అవుట్‌డోర్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు జిల్లా బాక్సర్ల ఎంపిక

- అభినందించిన జేసీ సేతు మాధవన్



విజేతలను అభినందిస్తున్న జేసీ సేతుమాధవన్

విజయనగరం అర్బన్: ఆంధ్ర యూనివర్సిటీ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచి జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించిన జిల్లా బాక్సింగ్ క్రీడాకారులను జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ అభినందించారు. ఏయూ స్థాయిలో జరిగిన ఇంటర్ యూనివర్సిటీ బాక్సింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన జిల్లా బాక్సింగ్ క్రీడాకారులు సోమవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్‌ను కలిశారు. 46–48 కిలోల విభాగంలో స్వర్ణ పతకం సాధించిన ఎస్.తేజస్వి, 48–51 కిలోల విభాగంలో స్వర్ణ పతక విజేత ఎ.సాయి, 52 కిలోల విభాగంలో రజత పతక విజేత ఎస్.కే.సుల్తానా, 93 కిలోల విభాగంలో స్వర్ణ పతక విజేత జి.లిఖిత్ రెడ్డి జేసీని కలిసి వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా వారిని జేసీ అభినందిస్తూ జాతీయస్థాయిలో పంజాబ్‌లో డిసెంబర్ 26 నుంచి జరిగే అఖిల భారత విశ్వవిద్యాలయ బాక్సింగ్ పోటీల్లో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ వెంకటేశ్వరరావు, బాక్సింగ్ కోచ్ ఈశ్వరరావు పాల్గొన్నారు.

కోడిపందాల నిర్వహణలో పోలీస్ పాత్రపై విచారణ

- డీఐజీ గోపీనాథ్ జెట్టి

విజయనగరం క్రైమ్:

జిల్లాలోని ఎల్.కోట మండలం భీమాలిలో ఇటీవల కోడిపందాలను నిర్వహించిన వారిపై కేసు నమోదుచేయడంలో అలసత్వం ప్రదర్శించిన సంఘటనలో విచారణ కొనసాగుతుందని, అందుకు బాధ్యులైన వారిపై శాఖాపరంగా కఠినచర్యలు తప్పవని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత నెల 27న ఎల్.కోట మండలం భీమాలి గ్రామశివార్లలో కోడి పందాలు నిర్వహిస్తున్న వారిపై పోలీసులు రైడ్ చేసి, వాహనాలు సీజ్ చేయడం, కేసు నమోదు చేయడంలో అలసత్వం ప్రదర్శించినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లుగా ఎస్పీ వకుల్ జిందాల్ తనకు నివేదిక పంపించారన్నారు. ఈ నివేదిక ఆధారంగా ఎల్.కోట పీఎస్‌లో అసిస్టెంట్ రైటర్‌గా పనిచేస్తున్న జి.సత్యనారాయణ అనే కానిస్టేబుల్‌పై తక్షణమే సస్పెన్షన్ విధించినట్లు తెలిపారు. విచారణ ఇంకా కొనసాగుతుందని, పోలీసు అధికారుల పాత్ర ఉన్నట్లు వెల్లడైతే వారిపై కూడా క్రమశిక్షణ చర్యలతో పాటూ శాఖాపరమైన కఠినచర్యలు తీసుకుంటామని డీఐజీ స్పష్టం చేశారు.

220 లీటర్ల సారా స్వాధీనం



స్వాధీనం చేసుకున్న సారా, ఆటోను చూపిస్తున్న ఎస్సై పి.నారాయణరావు, సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 220 లీటర్ల సారాను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు కురుపాం ఎస్సై పి.నారాయణ రావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గ్రామ సందర్శన నిమిత్తం ఆదివారం రంగుపురం గ్రామానికి వెళ్తుండగా ఆ మార్గంలో అనుమానాస్పదంగా వస్తున్న ఆటోను తనిఖీ చేసి క్యాన్, రబ్బర్ ట్యూబ్‌లో సారాను గుర్తించినట్లు చెప్పారు. ఆటోలో సారా తరలిస్తున్న ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేయడంతో పాటు ఆటోను, సారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలియజేశారు.

40 లీటర్ల సారా పట్టివేత

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి పరిసర ప్రాంతాలలో అక్రమంగా సారా అమ్ముతున్న ఓ వ్యక్తిని పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. దీనిపై ఎస్సై అనీష్ తెలిపిన వివరాల ప్రకారం చినమేరంగి పరిసర ప్రాంతాలలో సారా అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడి చేయగా ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తిరగడంతో అదుపులోకి తీసుకుని ఆ వ్యక్తి కలిగి ఉన్న 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.

చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించండి

- జలవనరుల శాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశం

విజయనగరం అర్బన్: జిల్లాలోని వాగులు, గెడ్డలపై చెక్ డ్యామ్‌లు నిర్మించేందుకు వారం రోజుల్లోగా ప్రతిపాదనలు సమర్పించాలని జలవనరులశాఖ అధికారులను కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్ నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. పనుల నిర్వహణ కోసం సీనరేజీ మినహాయింపు కూడా ఇస్తామన్నారు. జలవనరుల శాఖ పరిధిలో జిల్లాలో జరుగుతున్న కార్యక్రమాలపై ఆ శాఖ ఇంజినీర్లతో కలెక్టర్ కార్యాలయంలో సోమవారం సమీక్షించారు. జలవనరుల శాఖకు వివిధ ప్రాజెక్టుల పరిధిలో ఉన్న భూముల్లో ఆక్రమణల వివరాలను అందజేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఈ ఏడాది వివిధ ప్రాజెక్టుల పరిధిలో కాలువల నిర్వహణ పనులు, పూడికతీత పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.6 కోట్లు మంజూరు చేసిందని జలవనరుల శాఖ ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల చీఫ్ ఇంజినీర్ ఎస్.సుగుణాకరరావు తెలిపారు. డిసెంబర్‌లోగా టెండర్లు ఖరారు చేసి జనవరి నుంచి పనులు ప్రారంభిస్తామని వివరించారు. సమావేశంలో డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి, సీపీఓ పి.బాలాజీ, జలవనరుల శాఖ ఈఈలు రెడ్డి రామచంద్రరావు, ఎం.వి.రమణ, డీఈలు పాల్గొన్నారు.

30న గురజాడ సాహితీ చైతన్యోత్సవం

విజయనగరం టౌన్: మహాకవి గురజాడ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 30న గురజాడ సాహితీ చైతన్యోత్సవం నిర్వహిస్తామని గురజాడ సాంస్కృతిక సమాఖ్య సభ్యులు తెలిపారు. ఈ మేరకు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కోట వద్ద నున్న మహాకవి గురజాడ స్వగృహంలో సోమవారం మహాకవి గురజాడ సాహితీచైతన్యోత్సవం ఆహ్వానపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు కాపుగంటి ప్రకాష్, డాక్టర్ ఎ.గోపాలరావు మాట్లాడుతూ ఆ రోజు జరిగే డాక్టర్ మీగడ రామలింగస్వామికి గురజాడ విశిష్ట పురస్కారం ప్రదానోత్సవంలో సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతల వెంకటరమణతో పాటు మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతి, కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌లు పాల్గొంటారన్నారు. సమావేశంలో సమాఖ్య ప్రతినిధులు డాక్టర్ జక్కు రామకృష్ణ, ఈపు విజయకుమార్, భోగరాజు సూర్యలక్ష్మి, గురజాడ ఇందిర, గురజాడ ప్రసాద్, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

అంతర్ వర్సిటీ క్రాస్‌కంట్రీ పోటీలకు సీతం విద్యార్థి ఎంపిక

విజయనగరం అర్బన్: అఖిల భారత అంతర విశ్వవిద్యాలయాల స్థాయిలో అథ్లెటిక్స్ విభాగంలోని క్రాస్ కంట్రీ ఈవెంట్‌లో పదివేల మీటర్ల పోటీలకు పట్టణంలోని గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి ఎం.సాయి యశ్వంత్ ఎంపికయ్యాడు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీరామమూర్తి సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. మహారాష్ట్రలోని నాందేడ్‌లో గల ఎస్ఆర్‌టీఎం యూనివర్సిటీలో జరిగే పోటీలకు జేఎన్‌టీయూ జీవీ జట్టు తరపున యశ్వంత్ పాల్గొంటాడని పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల మీద కక్ష సాధింపు

- ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు

పార్వతీపురంటౌన్: రాష్ట్రవిద్యాశాఖ అధికారుల తీరు ఉపాధ్యాయుల మీద కక్ష సాధించుకునే విధంగా ఉందని, అందువల్లనే అనవసరమైన విషయాల మీద చర్చకు తావిస్తూ ఉపాధ్యాయులను బలిపశువులుగా చేస్తున్నారని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మహేష్, బాలకృష్ణ తీవ్రంగా విమర్శించారు. ఉన్నత పాఠశాలల పని వేళలు దశాబ్దాల నుంచి రోజుకు 7 గంటల చొప్పున శాస్త్రీయంగా నిర్ణయించారన్నారు. విద్యార్థులు వారి ఇళ్ల వద్ద చదువుకోవడానికి కూడా వెసులుబాటు కలుగుతుందని, ప్రస్తుతం విద్యాశాఖ అధికారులకు ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థుల చదువు పట్ల నిజమైన అపేక్ష ఉంటే ఉపాధ్యాయులను పూర్తిగా బోధనేతర పనులనుంచి మినహాయించి విద్యార్థుల పట్ల వారి నిబద్ధతను, చిత్తశుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల బదిలీలలో ఒకే శ్లాబ్‌లో ఇంటి అద్దె అలవెన్స్ పొందుతున్న ఉపాధ్యాయుల మధ్య చిచ్చు పెట్టడానికి జనాభా ప్రాతిపదికన బదిలీల్లో అసమానత్వాన్ని కలిగించడం అనాలోచిత నిర్ణయమన్నారు. ఇలాంటి అనవసరమైన గందరగోళానికి ఉపాధ్యాయులను గురికానివ్వకుండా చూడాలని ప్రభుత్వ అధికారులను కోరారు.

108 అంబులెన్స్ ఉద్యోగుల
సమస్యలు పరిష్కరించాలి



రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్న 108 అంబులెన్సుల ఉద్యోగులు

- కలెక్టరేట్ వద్ద రిలే నిరాహారదీక్షల ప్రారంభం
- ఈనెల 25 నుంచి సమ్మె
- స్పష్టం చేసిన ఉద్యోగుల సంఘం

పార్వతీపురంటౌన్: 108 అంబులెన్స్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా కన్వీనర్ బీవీ రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని 108 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గొర్లి అప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2005వ సంవత్సరం నుంచి ప్రభుత్వం ప్రారంభించి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 108 అంబులెన్సు వ్యవస్థ దేశంలోని అత్యున్నతమైన ప్రజాసేవగా గుర్తింపు పొందిందన్నారు. అలాంటి వ్యవస్థను ప్రభుత్వం నేరుగా నిర్వహించకుండా ప్రైవేట్ సర్వీస్ ప్రొవైడర్లకు అప్పగించడం పట్ల నిరసన వ్యక్తం చేశారు. ప్రైవేట్ సంస్థల లాభాపేక్ష వల్ల సర్వీసుల నాణ్యత పోతోందని ఆవేదన వెలిబుచ్చారు. అంబెలెన్సుల్లో పనిచేస్తున్న చేస్తున్న కార్మికులు ఉద్యోగులకు కనీస వేతనాలు చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ సదుపాయాలు గ్రాట్యుటీ, పెన్షన్ సౌకర్యం కల్పించడం లేదని వాపోయారు.

వాహనాలు ఫిట్‌నెస్ లేకపోవడంతో ప్రమాదాలు

108 వాహనాలు ఫిట్‌నెస్ లేకపోవడం వలన ప్రమాదాలకు గురై అనేకమంది ఉద్యోగులు మరణిస్తున్నారని, వారికి ఎలాంటి పరిహారం ప్రభుత్వం గాని, యాజమాన్యం గాని చెల్లించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎనిమిది గంటల పనిదినం అమలు చేయాలని, ప్రావిడెంట్ ఫండ్ యాజమాన్య వాటా యాజమాన్యం చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలి

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నింటిపై ఇప్పటికే అనేక దఫాలుగా ప్రభుత్వ అధికారులు, మంత్రులకు విన్నవించుకున్నామని, అయినప్పటికీ ఎలాంటి ఫలితం రాలేదని ఇప్పటికైనా 108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని, లేనట్లయితే ఈనెల 25వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు వెళ్లనున్నట్లు నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దావాల రమణారావు, వై.మన్మథరావు, జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, 108 ఉద్యోగుల సంఘం నాయకులు తెర్లి వెంకటరమణ, తెంటు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు కలెక్టర్ అభినందన



విజేతలను అభినందిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: అంతర్జాతీయ బాలికా సంరక్షణ దినోత్సవం సందర్భంగా అక్టోబర్ 11వ తేదీన జిల్లా స్థాయిలో పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల విజేతలను కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అభినందించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ సంయుక్తంగా బాలికా సంరక్షణపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలను నిర్వహించాయి. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కలెక్టర్ సోమవారం తన చాంబర్‌లో నగదు బహుమతులు అందజేశారు. ఒక్కో విభాగంలో ప్రథమ బహుమతి విజేతకు రూ.5 వేలు, ద్వితీయ బహుమతి విజేతకు రూ.3 వేలు, తృతీయ బహుమతి విజేతకు రూ.2 వేలు వంతున నగదు బహుమతులు అందజేశారు. వక్తృత్వం పోటీల్లో వి.లతాశ్రీ (బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల, కొత్తవలస), టి.లావణ్య (జెడ్‌పీహెచ్ వంగర), ఎం.రమ్య (కేజీబీవీ, గుర్ల) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వ్యాసరచన పోటీల్లో పి.పరిమళ (ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల చీపురుపల్లి), పి.ప్రత్యూశ్రీ (ఏపీమోడల్ స్కూల్, షికారుగంజి), పి.భాగ్యశ్రీ (జెడ్పీ హైస్కూల్, కొట్యాడ), చిత్ర లేఖనంలో ఎం.గౌతమ్ (జెడ్పీ హైస్కూల్, దేవాడ) జి.జ్యోతి (కేజీబీవీ, గుర్ల), జి.మేఘన (బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల, కొత్తవలస) వరుసగా మూడుస్థానాల్లో నిలిచారు. కార్యక్రమంలో డీఈఓ మాణిక్యం నాయుడు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాణి తదితరులు పాల్గొన్నారు.

మూడు నామినేషన్ల తిరస్కరణ

సీతంపేట: జీసీసీ ఎన్నికలకు సంబంధించి 3 నామినేషన్‌లు తిరస్కరించినట్లు ఎన్నికల అధికారి విజయ్‌కుమార్ తెలిపారు. మొత్తం 9 నామినేషన్‌లను అభ్యర్థులు దాఖలు చేయగా వివిధ కారణాల వల్ల బి.కృష్ణారావు, పి.ఆదినారాయణ, పి.సింహాచలంల నామినేషన్ స్క్రూట్నీలో తిరస్కరించామన్నారు. మిగతా ఆరుగురు సభ్యుల్లో చైర్మన్, వైస్‌చైర్మన్, నలుగురు బాడీ మెంబర్లను ఎన్నుకోనున్నట్లు చెప్పారు.

పోక్సో కేసులో ముద్దాయికి మూడేళ్ల జైలు

విజయనగరం క్రైమ్: జిల్లాలోని బూర్జవలస పోలీస్‌స్టేషన్‌లో 2021లో నమోదైన పోక్సో కేసులో నేరం నిరూపణ కావడంతో ముద్దాయి దత్తిరాజేరు మండలం పాచలవలస గ్రామానికి చెందిన సైలాడ లక్ష్మణరావుకు విజయనగరం పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి మూడేళ్ల జైలుశిక్ష, రూ. 2వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. దత్తిరాజేరు మండలం పాచలవలస గ్రామానికి చెందిన సైలాడ లక్ష్మణరావు 2021లో ఇంటర్మీడియట్ చదువుతున్న బాలిక వెంటపడి వేధింపులకు పాల్పడుతూ, కిడ్నాప్ చేసి, లైంగికదాడికి పాల్పడ్డాడని బూర్జవలస పోలీస్‌స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై కె.రాజేష్ కేసు నమోదుచేశారు. ఆ కేసు దర్యాప్తు పూర్తయ్యాక నిందితుడిని అరెస్టు చేసి, న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు. ఈ కేసులో సకాలంలో సాక్షులను, ఆధారాలను న్యాయస్థానంలో ప్రవేశపెట్టగా, ప్రాసిక్యూషన్ త్వరితగతిన పూర్తిచేసి ముద్దాయిని నిర్ధారించి శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. ఈ కేసులో పోలీసుల తరఫున మాజీ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మావూరి శంకరరావు వాదనలు వినిపించారు.